## కథ

# న్యాయం నిదుర పోలేదు

◆ మెండదల లక్ష్మీదివాకర్ ◆

**రోహిణి ఎండకు రోళ్ళు పగులుతాయన్నది ఎంత నిజమో తెలియదు కాని ఆకాశంలోని సూర్యుడు మాత్రం మహా నియంతలా చండ్ర నిప్పులు కురిపిస్తున్నాడు.**

పొయ్యిమీద ఎర్రగా కాలిన పెనంలా తార్రోడ్డు కాలిపోతోంది. మధ్యాహ్నం సమయం కావడంతో ఎండకు తట్టుకోలేక రోడ్డుమీద జనం పెద్దగా తిరగటం లేదు.

"అబ్బాయి ఈ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తున్నాడంట. సాయంకాలం చూడ్డానికి వస్తున్నారంట మన రేఖని. తొందరగా రారా శంకరం" ఉదయం కోర్టుకు బయలుదేరినప్పుడు అమ్మ చెప్పిన మాట గుర్తొచ్చి హడావుడిగా ఫైళ్ళు పట్టుకుని కోర్టులోంచి బయటపడి బస్టాండులో అడుగుపెట్టాను.

దృష్టి వాచీముల్లు మీదే ఉంచి, అసహనపు ముల్లుమీద నిలబడి 13A కోసం ఎదురు చూడసాగాను.

విశాఖపట్నంలో సమయానికి బస్సు రావటం, వచ్చాక దాన్లో కాలు పెట్టగలగటం ఏమంత చిన్న విషయం కాదు. అందులోనూ చంకలో ఫైళ్ళు, చేతిలో నల్లకోటుతో వున్న నాలాంటి వాడికి మరీనూ. అసలు విశాఖలో బస్సుల గమ్మత్తు రాస్తే ఓ భారతమే అవుతుంది. ఒకరోజు బిఫోర్ టైమంటూ మధ్యదార్లో ఆపుతారు. ఇంకోరోజు స్టాపుకు దూరంగా తీసుకుపోయి ఆపుతారు. ఇవి రెండూ లేనినాడు బస్సు దానంతటదే ఫేలవుతుంది.

ఎంతో ఆతృతతో ఎదురుచూసిన 11C బస్సు మరో అర్ధగంటకు పూర్ణగర్భిణిలా రానే వచ్చింది. బస్సు రావటంతోనే ఫుట్‌బోర్డు మీద తొక్కిసలాట మరీ ఎక్కువయింది.

ఆ రద్దీని చూడగానే బస్సులో వెళ్ళటం అయ్యేపని కాదని ఫుట్‌పాత్ మీదకొచ్చి రిక్షాలో వెళ్ళాలని నిర్ణయించుకున్నాను.

"ఒరేయ్ రిక్షా!" బక్కచిక్కి, చిరిగిన చొక్కాలో, కాకీ నిక్కరుతో వున్న రిక్షావాడ్ని పిలిచాను.

"అయ్యా! పిలిచారా?" నుదుటన పట్టిన చెమటను తుడుచుకుంటూ వచ్చాడు.

"లలితానగర్‌కు వస్తావా?"

"వస్తానండి".

"ఏమివ్వమంటావురా?"

"మీ ఇష్టమొచ్చినంత ఇవ్వండి సార్".

"కాదు చెప్పు ఎంతివ్వమంటావ్..."

"ఐదు రూపాయలివ్వండిసార్..." ఆ ముండుటెండలో చెమటతో తడిసిన చేతులను హేండిల్ మీదపెట్టి నిలబడ్డ ఆ బాలకార్మికుడ్ని చూసి బేరమాడాలనిపించలేదు. మాటాడకుండా రిక్షా ఎక్కి కూర్చున్నాను.

కోర్టులో లాయరుగా పదిహేనేళ్ళ నుండి ప్రాక్టీసు చేస్తున్నా కనీసం స్కూటరయినా లేకుండా బస్సులోనే ప్రయాణం చేస్తున్నానంటే కారణం, నేను కోర్టుకొస్తున్నది న్యాయాన్ని బ్రతికించటం కోసం గాని, నల్లకోటు నుపయోగించి "నల్లమేకను తెల్లకాకిని చేస్తారు లాయర్ శంకర్రావుగారు" అనే చెడ్డ పేరు కోసం కాదు.

న్యాయంకోసమే గాని డబ్బుకోసం కక్కుర్తి పడరాయన. నిప్పయినా నీటికి లొంగుతుంది గాని ఆయన మాత్రం నీతి తప్పని స్థిత ప్రజ్ఞుడని న్యాయం పొందిన వారు తృప్తిగా అనుకుంటే, వాళ్ళకళ్ళల్లో మెరుపు చూస్తుంటే కలిగిన ఆనందం, నల్ల డబ్బు సంపాదనలో లేదనిపిస్తుంది నాకు.

"సార్! లలితానగర్ వచ్చిందండి" రిక్షా అబ్బాయి అరుపుతో ఆలోచనల్లోంచి తేరుకుని వాడికి డబ్బిచ్చి పెళ్ళివారు వస్తారని ఖంగారుగా యింట్లో కడుగు పెట్టాను. పది నిముషాలలో అనుకున్న ప్రకారం రేఖని చూసి పోవటానికి పెళ్ళివారు వచ్చారు.

పెళ్ళికొడుకు, తల్లి, పెళ్ళయిన ఒకే ఒక చెల్లెలు మాత్రం వచ్చారు. హడావుడి అంతా సద్దుమణిగినాక రేఖని నడిపించుకుని వచ్చి వాళ్ళ ఎదురుగా కూర్చోబెట్టింది నా శ్రీమతి. వాళ్ళకు రేఖ

◆ ◆ ◆

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

◆ ◆ ◆

నచ్చింది. అన్ని విషయాలు మాట్లాడుకున్నారు. ముహూర్తం పెట్టించాక కబురు చెయ్యమని చెప్పి బయలుదేరారు పెళ్ళివారు.

★★★★

మర్నాడు కోర్టులో పని పూర్తిచేసుకుని, ఫైళ్ళతో కోర్టు ఆవరణదాటి రోడ్డుమీదకొచ్చేసరికి...

"సార్!..." అన్న కేక అతిచేరువలో...

ఎవరో క్లయింటయి వుంటారని వెనక్కి తిరిగి చూసాను. రిక్షా కుర్రాడు "నిన్న మీరు డబ్బిచ్చారు సార్. నేను యింటికెళ్ళినాక చూసుకుంటే ఐదురూపాయలు బదులు పది ఉంది. ఈ రోజు కోర్టుకు వస్తారుకదా డబ్బులివ్వవచ్చని ఉదయం నుండి చూస్తున్నానుసార్..." అంటూ ఐదు రూపాయలనోటు చేతికందించాడు.

◆◆◆

## నల్లమేకను తెల్లకాకిగా చేస్తారు లాయర్ శంకర్రావ్.

◆◆◆

నాకు నోటివెంట మాటరాలేదు.

కాయకష్టంలో నికృష్టమైన బ్రతుకువెలార్చే వీళ్ళలో ఇంత నిజాయితీవా...?

నీతి, నిజాయితీ సూటూ బూటూ వేసుకుని ఏ.సి.రూముల్లో నివసించే వాళ్ళల్లో లేదని, ఎండనక, వాననక తమ శ్రమనంతా పరుల కొరకు ధారపోసినా, నిజాయితీని మాత్రం వదలకుండా చూసుకుంటున్న పేదవాళ్ళ మనస్సుల్లోనే వుందనిపించిందా క్షణం.

"న్యాయానికి కాలు విరిగి, ధర్మానికి నడుము విరిగి, నేలమీద ప్రాకుతున్న ఈతరుణంలో నిజా యితీని వాడిపోనీయకుండా బ్రతికించుకుంటున్న భావిపౌరులుండటం జాతికే ముదావహం"

